



• చిలకలూరిపేటలో అమెరికన్ డైమండ్లతో గణనాథుని విగ్రహం

గణపతి బప్పా మోరియా



పత్రిక కొనుగోలు


మట్టి గణపతి ముద్దు

- జిల్లా వ్యాప్తంగా చవితి ఉత్సవ శోభ
- పందిళ్లలో కొలువుదీరిన భారీ గణనాథులు
- పల్లె, పట్టణాల్లో చవితి పండుగ కోలాహలం

నరసరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బుధవారం వినాయక చవితి పర్వదినంతో జిల్లా అంతటా ఉత్సవశోభ నెలకొంది. పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా గణపతి ఉత్సవాలకు భక్తులు భారీగా ఏర్పాట్లు చేశారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల తదితర పట్టణాలతో పాటు ముఖ్యమైన మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో కూడా భక్త జన కమిటీలు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాయి. బహుళ అంతస్తుల భవనాల్లో గణపతి వేడుకలు నిర్వహిస్తున్నారు. గత ఏడాది కంటే ఉత్సవ మండపాలు గణనీయంగా పెరిగాయి. పెద్దఎత్తున మండపాలను నిర్మించి భారీ గణనాథులను పూజకు సిద్ధం చేశారు. సినీ సెట్టింగ్ తరహాలో కొన్ని ప్రాంతాల్లో చవితి పందిళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో పందిళ్లను శోభాయమానంగా అలంకరించారు. ఆయా ప్రాంతాల్లోని వీధులు, మండపాలు విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి. చిన్నారులు నుంచి వృద్ధుల వరకు ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఉత్సవాల నిర్వహణలో భక్తులు పోటీ పడుతున్నారు. చిలకలూరిపేటలో రూ.50 లక్షల విలువైన అమెరికన్ డైమండ్లతో వినాయక విగ్రహం రూపొందించారు.

ఉచిత విద్యుత్‌పై హర్షం..

రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం గణపతి ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ ప్రకటించింది. ఈ మేరకు విద్యుత్‌శాఖకు మంగళవారం సాయంత్రం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు అధికారులు తెలిపారు. ఉచిత విద్యుత్ అమలుతో నవరాత్రులు నిర్వహించే ఉత్సవ కమిటీలతో పాటు ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి ఆయా వర్గాలు కృతజ్ఞతలు తెలిపాయి. భక్తుల విరాళాలతో ఉత్సవాలను నిర్వహించే కమిటీలకు ఉచిత విద్యుత్ పెద్ద ఊరటగా మారింది. గతంలో మండపాలకు వినియోగించే విద్యుత్‌కు కిలో వాట్‌కు రూ.2,400 ట్రాన్స్‌కో వసూలు చేసేది. భారీ మండపాలకు దాదాపు 20 కిలో వాట్ల వరకు విద్యుత్‌ను వినియోగిస్తారు. ఈ ప్రకారం పెద్ద మండపాలకు రూ.18,900 నుంచి రూ.37,000 వరకు విద్యుత్ ఛార్జి ఖర్చయ్యేది. ఈ సారి ఉచిత విద్యుత్‌తో ఆ మేర భారం తగినట్లేనని ఉత్సవ కమిటీలు తెలిపాయి. ప్రతి మండపానికి బుధవారం సాయంత్రానికి మీటర్లు ఏర్పాటు చేసి ఏ మేరకు విద్యుత్ వినియోగించుకున్నారో రీడింగ్ తీసి ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు అధికారులు సిద్ధమయ్యారు. దీని ఆధారంగా ట్రాన్స్‌కోకు విద్యుత్ ఖర్చును ప్రభుత్వం చెల్లించనున్నది.





గణపతి విగ్రహం తీసుకువెళుతున్న బాలుడు

◆ ఊరేగింపులు.. కొనుగోళ్ల సందడి..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వినూత్న రూపాల్లోని విగ్రహాలను అమ్మకాలకు సిద్ధం చేశారు. దీంతో తయారీదారుల నుంచి విగ్రహాలను కొనుగోలు చేసిన ఉత్సవ నిర్వాహకులు ఊరేగింపుగా మండపాలకు తరలించుకున్నారు. దీంతో మంగళ వారం ఉదయం నుంచి ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. డప్పువాయిద్యాలతో యువకులు హడావుడి చేశారు. వినాయక ప్రతిమలు, పత్రి, పూజా సామగ్రి విక్రయాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి.



గణపతి విగ్రహాన్ని తీసుకువెళుతున్న భక్తులు

9 గ్రామాలకు.. తీపికబురు

ఎస్సీ జనాభా ఎక్కువ ఉన్న పల్లెలకు రూ.40 లక్షలు

రోడ్లు, కాల్వలు, సామాజిక భవనాల నిర్మాణానికి వినియోగం



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తొమ్మిది గ్రామాలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న పంచాయతీలకు అదనపు నిధులను విడుదల చేసింది. ఎంపిక చేసిన గ్రామాల్లో రూ.40 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం వచ్చింది. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద రూ.20 లక్షలతో పాటు ఉపాధి హామీ పథకం నుంచి మ్యాచింగ్ గ్రాంట్‌గా మరో రూ.20 లక్షలు ఎంపిక చేసిన ఒక్కో గ్రామానికి కేటాయించారు. ఎస్సీ జనాభాను ప్రామాణికంగా తీసుకుని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని గ్రామాలను ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద ఎంపిక చేశారు. గ్రామ జనాభాలో ఎస్సీలు 50 శాతం కన్నా ఎక్కువ ఉంటారో ఆ గ్రామాలను ప్రస్తుతం ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తొమ్మిది గ్రామాల్లో ఎస్సీ జనాభా ఎక్కువ ఉంది కాబట్టి ఈ అదనపు నిధులు పొందేందుకు అర్హత సాధించినట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు ఎస్సీ జనాభా ప్రమాణికంగా విడుదలైనా ఖర్చు మాత్రం గ్రామంలో ఎక్కడ అవసరం ఉంటే అక్కడ వినియోగించుకోవచ్చు. సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, సామాజిక భవనాలు, తాగునీటికి అవసరం అయిన పనులను కూడా చేసుకోవచ్చు.

ఎంపికైన గ్రామాలు

గుంటూరు జిల్లా: ఐనవోలు (తుళ్లూరు), అన్నవరం (పెదనందిపాడు), బ్రాహ్మణ కోడూరు(పొన్నూరు) **బాపట్ల జిల్లా:** అనంతవరం, ఈపూరు (కొల్లూరు), ఈతేరు(బాపట్ల), మోపర్రు (అమృతలూరు) **పల్నాడు జిల్లా:** అందుకూరు (క్రోసూరు), ముతనపల్లి (రొంపిచర్ల)

గ్రామాభివృద్ధికి అవకాశం

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద విడుదలైన అదనపు నిధులతో గ్రామీణాభివృద్ధికి సువర్ణ అవకాశం వచ్చినట్లే. ఈ నిధులు వినియోగించి ఆయా గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు మెరుగు పర్చుకోవచ్చు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగు నీటి సరఫరా తదితర సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుంది.



- వీర్ల జ్యోతిబసు, సీఈఓ

బార్ లైసెన్సు.. సైలెన్స్

- దరఖాస్తులపై స్పందన నిల్
- బార్లపై ఆసక్తి చూపని వ్యాపారులు
- బాపట్ల జిల్లాలో 15 బార్లకు సున్నా దరఖాస్తులు
- గుంటూరు జిల్లాలో 92, పల్నాడులో 40 బార్లకు..
- మూడు జిల్లాలో 176 బార్లలో 29కి 75 దరఖాస్తులు
- మళ్లీ 29 వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు

నరసరావుపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన బార్ పాలసీపై వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. గత వైసీపీ హయాంలో ప్రభుత్వ వైన్స్‌ను తొలగించి ప్రైవేటుగా వైన్స్‌లకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలపగా పెద్దఎత్తున వ్యాపారులు ముందుకు వచ్చారు. దరఖాస్తు ఫీజుల రూపంలోనే రూ.కోట్లలో ఆదాయం సమకూరింది. ఈ నేపథ్యంలో బార్లకు కూడా పెద్దఎత్తున పోటీ వస్తుందని ప్రభుత్వం ఆశించింది. అయితే కనీస స్థాయిలో కూడా వ్యాపారులు స్పందించక పోవడం గమనార్హం. వైన్స్‌కు లాగానే ఒక్కొక్కరు ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినా వ్యాపారుల నుంచి స్పందన లేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 176 బార్ల ఏర్పాటుకు ఈ నెల 18 నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా వాటిలో 75 మంది వ్యాపారులు ముందుకు వచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఒక్కో బార్ లైసెన్స్‌కు కనీసం 4 దరఖాస్తులు రావాల్సి ఉంది. ఆ లెక్కన మూడు జిల్లాలో 176 బార్లకు 704 దరఖాస్తుల రావాల్సి ఉంది. అయితే 10.65 శాతం అంటే 75 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. బాపట్ల జిల్లాలో 15, గుంటూరు జిల్లాలో 92, పల్నాడులో 40 బార్లకు ఇప్పటి వరకు సున్నా దరఖాస్తులు రావడంపై అధికారులు ఆశ్చర్య పోతున్నారు. నగరపాలక సంస్థ, మున్సిపల్ పట్టణ, పంచాయతీల ప్రకారం బార్ల ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తులకు గడువు మంగళవారంతో ముగిసింది. పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రధాన పట్టణాల్లో కూడా బార్ల ఏర్పాటుకు ఒక్కరు కూడా ముందుకు రాలేదు.

ఆర్థిక భారమని వెనకడుగు..

తొలుత బార్ల ఏర్పాటుకు ఆశావహులకు ప్రభుత్వం ఉచిత ఎన్‌రోల్‌మెంట్‌కు అవకాశం కల్పించింది. దీంతో ఎక్కడికక్కడ పలువురు పేర్లను నమోదు చేసుకున్నారు. తీరా దరఖాస్తుల విషయానికి వచ్చేసరికి వెనక్కి తగ్గారు. ఉచిత ఎన్‌రోల్‌మెంట్ తర్వాత ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.10,000 చెల్లించడంతో పాటు దరఖాస్తు రుసుం రూ.5,00,000 చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాలు నాన్‌రిఫండ్‌బుల్‌గా ప్రభుత్వం ప్రకటించింది. మార్గదర్శకాల ప్రకారం ఒక్కో షాపుకు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ ప్రక్రియ జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. మూడేళ్ల పాటు లైసెన్సును (మిగతా 8వ పేజీలో)


రామాంజనేయపురంలో రచ్చబండ

గ్రామ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ హామీ

బెల్లంకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాంజనేయపురంలో మంగళవారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తొలుత ఆయన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డు వసతి లేదని, కాల్వలు లేక పోవడంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుందని, వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని, తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. పీఎం సూర్యఘర్ ద్వారా గిరి జనుల ఇళ్లకు వంద శాతం సబ్సిడీతో సౌర విద్యుత్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేయాలని డీపీవోను ఆదేశించారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. వినాయక చవితి తర్వాత పాఠశాలను ప్రారంభించి ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని డీఈవో చంద్రకళను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీ రాణి, తహసీల్దార్ ప్రవీణ్, డీఎంహెచ్‌వో రవి, డీవైఈవో నాగేశ్వరరావు నాయక్, ఎంపీడీవో శ్రీనివాసనాయక్, టీడీపీ నాయకులు అక్కల వెంకట రామిరెడ్డి, అక్కల సుబ్బారెడ్డి, డాక్టర్ హనుమంతరావు, వర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ అరుణ్ బాబు



జోరుగా వరినాట్లు

- కాల్వలకు పుష్కలంగా నీటి సరఫరా
- బిహార్ నుంచి వచ్చిన వలస కూలీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


నాగార్జున సాగర్ ఆయకట్టులో వరిసాగు ఊపందుకుంది. కాల్వలకు పుష్కలంగా నీటి సరఫరా చేస్తుండటంతో సాగు పనులు విస్తృతంగా జరుగుతున్నాయి. వరి నాట్లతో పుడమికి పచ్చని బొట్లు పెట్టినట్లుగా కనిపిస్తోంది. నాట్లు పూర్తయిన ప్రాంతాలు పచ్చని తివాచి పరిచినట్లుగా పచ్చదనంతో ఆకట్టుకుం టున్నాయి. 96,497 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా కాగా ఇప్పటికే 20,127 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు మరో పది వేల ఎకరాల్లో నాట్లు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రైతు లు సాగు పనుల్లో నిమగ్నమ య్యారు. కూలీలకు చేతి నిండా పని దొరుకుతు న్నది. పనుల కోసం ఇత ర జిల్లాల నుంచి కూలీ లు, ట్రాక్టర్ల నిర్వాహకులు జిల్లాకు పెద్దసంఖ్యలో వలస వస్తున్నారు. బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు కూడా వరినాట్ల పనుల్లో పాల్గొంటున్నారు. గోదావరి జిల్లాల నుంచి కూడా కార్మికులు వరి నాట్ల కోసం తరలి వచ్చారు. నరసరావుపేటలో దమ్ము చక్రాలు, నాగళ్ల తయారీ విస్తృతంగా చేపట్టారు.



వరి నాట్లు వేస్తున్న బిహార్ కార్మికులు



● వరి నారు తీస్తున్న మహిళలు



● చిలకలూరిపేట మేజర్ కాల్వలో నీటి ప్రవాహం



పొలం దమ్ము

నదిలో పడవలపై నిషేధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు పడవలపై ప్రయాణికుల రాకపోకలు నిషేధించినట్లు తహసీల్దార్ బీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో అటు ఇటు అయితే జీవితం ఎటో అనే శీర్షిక ప్రచురితం కావడంతో తహసీల్దార్ స్పందించారు. మండల పరిధిలోని గాజుల్లంకలోని పుష్కరఘాట్ వద్దకు వెళ్లి అక్కడ పడవల నిర్వాహకులైన మత్స్యకారులతో మాట్లాడారు. కృష్ణానదిలో వరద ప్రవాహం ఉధృతంగా ఉండగా గాజుల్లంక-శ్రీకాకుళం మధ్య పడవల ద్వారా ప్రయాణికులను ఎందుకు చేరవేస్తున్నారని నిలదీశారు. చిన్న చిన్న పడవల ద్వారా ప్రయాణికులను చేరవేసే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని, పైగా ప్రయాణికుల భద్రత కోసం



పడవ ప్రయాణంపై మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

మీ వద్ద ఎటువంటి లైఫ్ జాకెట్లు, ట్యూబ్‌లు లేకుండా పడవ ప్రయాణాలు చేయడం సరికాదని మందలించారు. ఇకపై కృష్ణానదిలో పడవల ద్వారా ప్రయాణికులను దాటిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పడవల లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ గ్రామ అధికారి, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అత్తోటలో వృద్ధురాలిపై దుండగుల దాడి

కొల్లిపర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అత్తోటలో వృద్ధురాలిపై దుండగులు దాడి చేసి సుమారు 12 సవర్ల నగలు అపహరించిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం అత్తోట గ్రామానికి చెందిన బొల్లిముంత బుల్లెమ్మ ఇంటిలో ఉండగా ఆమెపై దుండగులు దాడి చేసి బంగారు గొలుసు, గాజులు తీసుకుని పరారయ్యారు. బుల్లెమ్మకు బలమైన గాయాలు అవ్వడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేరు మార్చి.. ఏమారుస్తున్నారు



- నార్త్ ఈస్టు పోయే... అమరావతి నేషనల్ లారీ ఓనర్స్ వచ్చే
- మళ్లీ భయపడిపోతున్న మిర్చి ఎగుమతిదారులు
- కొత్త అసోసియేషన్ వెనక గతంలోని వ్యక్తులున్నారని అనుమానాలు
- అసోసియేషన్‌కి, లారీ కిరాయిలకు సంబంధం ఏమిటని ప్రశ్నలు
- సీఎం చంద్రబాబు ఆదేశాలు పాటించాలని కోరుతున్న ట్రేడర్లు

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్‌కు మిర్చి ఎగుమతులను దెబ్బతీసిన నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ అసోసి యేషన్ పీడ సీఎం చంద్రబాబు కఠినమైన ఆదేశాలుతో తొలగిపోయింది. ఆ అసోసియేషన్ ఇప్పటికే మూత పడగా మళ్లీ ఇప్పుడు కొత్తగా మరో సంఘం పుట్టుకొచ్చింది. పేరు మార్చుకొని శ్రీ అమరావతి నేషనల్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా కొంతమంది వ్యక్తులు తమని తాము పరిచయం చేసుకొంటూ ది గుంటూరు చిల్లీస్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్‌కు లేఖ రాయడం మిర్చి ట్రేడ్‌లో చర్చనీయాంశంగా మారింది. కొత్తగా లారీ యజమానులు ఎవరూ రాలేదని, పాత వాళ్లే వేరే పేరుతో మెల్లమెల్లగా వచ్చి ఏకు మేకుగా మారి మళ్లీ ఏకచత్రాధిపత్యం వహించాలని చూస్తున్నారన్న అనుమానాలను ఎగుమతిదారులు వ్యక్తపరుస్తున్నారు.

గుంటూరు నుంచి నిత్యం ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి ఎగుమతులు వెళుతుంటాయి. దీనిని అవకాశంగా చేసుకొన్న కొందరు వైసీపీ నాయకులు నార్త్ ఈస్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ అని స్థాపించి విపరీతంగా కిరాయిలు వసూలు చేశారు. దాంతో మిర్చి ఎగుమతిదారులు బెంబేలెత్తిపోయారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాలతో పోల్చితే దాదాపుగా ఇక్కడ లారీ కిరాయి రూ. 30 వేలకు పైగా అధికంగా ఉండటంతో మిర్చి వ్యాపారం తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు కదిలిపోయింది. ఒకదశలో ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి లారీ ఎక్స్‌పోర్టుకు పెట్టాలంటేనే వ్యాపారస్థులు భయపడిపోయారు. ఇందుకు కారణం అసోసియేషన్‌కు సంబంధం లేకుండా వేరే ఎవరైనా లారీ మాట్లాడుకొంటే సంఘం ముసుగులో రౌడీలు వచ్చి అడ్డుకునేవారు. లారీ టైర్లు కోసేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు.

ఈ విషయం గత ఏడాది సీఎం చంద్రబాబుకు ఇక్కడి వ్యాపారస్థులు నివేదించడంతో ఆయన వెంటనే స్పందించి డీజీపీకి ఆదేశాలు ఇచ్చారు. వ్యాపారస్థుల అభీష్టం మేరకు లారీలు కిరాయికి పెట్టుకునే వాతావరణం కల్పించాలని, ఎవరైనా అడ్డుపడితే కఠినమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దాంతో ఇక్కడి పోలీసులు కఠినంగా వ్యవహరించారు. లారీని కిరాయికి పెట్టుకునే విషయంలో వ్యాపారస్థులకు స్వేచ్ఛ కల్పించారు. ఈ కారణంగా ఖమ్మం జిల్లాకు తరలిపోయిన మిర్చి బిజినెస్‌లో చాలావరకు మళ్లీ వెనక్కు వచ్చేసింది. మరోవైపు వ్యాపరస్థులు ధర కూడా పెంచడంతో రైతుకు ప్రస్తుతం క్వింటాల్‌కు రూ. 14,500 వరకు లభిస్తున్నది.

కాగా శ్రీ అమరావతి నేషనల్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో ఒక లేఖని ది గుంటూరు చిల్లీస్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్‌కు పంపించారు. అందులో అసోసియేషన్ లారీకి లోడింగ్ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తాము నిర్ణీత సమయానికి, నాణ్యమైన సేవలతో మిర్చిని రవాణ చేస్తామని చెబుతూ ప్రతీ రోజు లోడింగ్ పనులు తమ సంఘం లారీలకు కల్పించాలని కోరారు. న్యాయమైన పోటీ ధరలతో రవాణ సేవలు అందిస్తామని ప్రతిపాదించారు. చిల్లీస్ అసోసియేషన్‌తో చర్చించిన తర్వాత కిరాయి నిర్ణయిస్తామంటూ సహకరించాలని కోరారు. అయితే వ్యాపారస్థులు మాత్రం సాఫీగా సాగిపోతున్న కిరాయిల విషయంలో మళ్లీ అసోసియేషన్ పేరు ప్రస్తావన తీసుకురావడం సరికాదని చెబుతున్నారు. ఏమైనా అడ్డు చెబితే తాము నేరుగా సీఎంని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

డేటా ఆధారిత పాలనకే పంచాయతీ అభివృద్ధి సూచిక

- జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధి పురోగతిని అంచనా వేయడానికి, డేటా ఆధారిత పాలనను ప్రోత్సహించడానికి పంచాయతీ అభివృద్ధి సూచిక దోహదపడుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్‌లో పంచాయతీ అభివృద్ధి సూచికపై జడ్పీటీసీలు, మండల పరిషత్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. జాతీయ స్థాయిలో ఉన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానం చేయడానికి పంచాయతీ అభివృద్ధి సూచిక వ్యూహాత్మక సాధనంగా పనిచేస్తుందని ఛైర్‌పర్సన్ అన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతిబసు మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో 9 స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల థీములపై పురోగతిని కొలిచి, లోపాలను గుర్తించటంలో పంచాయతీ అభివృద్ధి సూచిక కీలకంగా ఉంటుందని అన్నారు. ఈ విధానం వల్ల పంచాయతీల పనితీరును గ్రేడ్ల రూపంలో చూపించి, వాటికి బాధ్యత ఉండేలా చేస్తుందని, తద్వారా పారదర్శకత పెరగటంతో పాటు ప్రజలకు స్పష్టత ఉంటుందని అన్నారు. డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి బీవీఎస్ సాయి కుమార్, బాపట్ల ఈటీసీ కేంద్రం నుంచి శ్రీనివాసరావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టీనా, సీఈఓ జ్యోతి బసు, డీపీఓ సాయికుమార్

శతాధిక వృద్ధుల సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శతాధిక వృద్ధులకు సత్కారం నిర్వహించనున్నట్టు ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ పేర్కొన్నారు. మంగళవారం దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో శతాధిక వృద్ధుల సత్కారం కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన నూరేళ్లు పూర్తిచేసుకున్న వయోవృద్ధులను గుర్తించి వారినందరినీ ఒకే వేదికపై ఉంచి ప్రముఖుల చేతులమీదుగా సత్కరించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు 12 సార్లు 17 మంది శతాధిక వృద్ధులను గుర్తించి సత్కారం చేశామన్నారు. నూరేళ్లు పూర్తిచేసుకున్న వారు వచ్చేనెల 10లోపు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో స్వయంగా కానీ, 9848111138, 9347572766 ఫోన్ నంబర్లలో కానీ నమోదు చేయించుకోవాలని కోరారు. శతాధిక వృద్ధుల సత్కారం ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టీలు తట్టి అర్జునరావు, అమరా ఉమామహేశ్వరరావు, కే మధుసూదనరావు, పీ లక్ష్మీ నరసింహరావు, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.



శతాధిక వృద్ధుల సత్కారం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, ట్రస్టీలు

14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



విజయపురిసౌత్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో మంగళవారం ప్రాజెక్ట్ అధికారులు 14 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటి మట్టం 585.90 అడుగులు ఉంది. ఇది 300.03 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9387 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8807 క్యూసెక్కులు, ప్రధా న జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,739 క్యూసెక్కులు, 14 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,07,338 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ గా 1,61,971 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,61,971 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

టెయిల్‌పాండ్ నుంచి 1,32,556 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల,ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) :సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన వున్న పులిచింతలకు 9 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 1,32,556 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ,ఈఈలు సుబ్రహ్మణ్యం,నాగరాజులు చెప్పారు.ప్రాజెక్టుకున్న 20 గేట్లకుగాను 8 గేట్లను 3 మీటర్లు,1 గేట్‌ను 1.5 మీటర్ల మేర ఎత్తామన్నారు. ఎగువన వున్న సాగర్ నుంచి 1,41,077 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.45 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.011 టీఎంసీలకు సమానమన్నారు.విద్యుదుత్పత్తిని రెండు యూనిట్ల ద్వారా ప్రారంభించామని మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 35.0 మెగావాట్ల కరెంట్ తయారైందన్నారు.



టెయిల్‌పాండ్ నుంచి 9 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న కృష్ణమ్మ

బార్ లైసెన్సు.. సైలెన్స్

(7వ పేజీ తరువాయి)

వర్తింపచేసేలా తొలి ఏడాదికి లైసెన్స్ రుసుం రూ.55 లక్షలు, రెండో ఏడాది రూ.60.50 లక్షలు, మూడో ఏడాది రూ.66.55 లక్షలుగా ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వీటిని బేరీజు వేసుకున్న వ్యాపారులు, ఆర్థికంగా భారమని తలచి దరఖాస్తులకు ముందుకు రాలేదని తెలుస్తోంది. పైగా మద్యం షాపులకు పర్మిట్ రూంలకు అనుమతి ఇవ్వడంతో వ్యాపారం సాగదని వ్యాపారులు బార్లకు దరఖాస్తు చేయడానికి ఆసక్తి చూపలేదన్న వాదన వినిపిస్తోంది. జిల్లాల్లో ఎక్కువగా వైసీపీకి చెందిన వ్యాపారులు బార్లు నిర్వహిస్తుండగా ప్రస్తుతం వారు తిరిగి ఆ వ్యాపారానికి ముందుకు రానట్లు సమాచారం. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వ్యాపారులు మాత్రమే అక్కడక్కడ దరఖాస్తులు దాఖలు చేసినట్లు తెలిసింది. వచ్చే నెల 1 నుంచి నూతన బార్ పాలసీ అమల్లోకి వస్తుందని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. బార్ దరఖాస్తులకు వచ్చిన స్పందన మాత్రం అత్యంత తీసికట్టుగా ఉండడంతో ఈ నెల 29 వరకు గడువు పెంచింది. అప్పటికీ దరఖాస్తుల విషయంలో ఇదే రీతిలో స్పందన ఉంటే తదుపరి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

- బాపట్ల జిల్లాలో 17 బార్లకు 68 దరఖాస్తులు రావాలి. అయితే 16 బార్లకు ఇంతవరకు స్పందనే లేదు. అద్దంకి పరిధిలోని ఓ బార్‌కు మాత్రం 5 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఒక్క బార్‌కు లైసెన్స్ ఫీజు తక్కువగా రూ.35 లక్షలు కావడం వల్లే దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. జిల్లా కేంద్రమైన బాపట్లలోని ఓ బార్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు
- గుంటూరు జిల్లాలో 110 బార్లు ఉండగా కేవలం 18 బార్లకు మాత్రమే 47 దరఖాస్తులు వచ్చాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఆరు బార్లకు నాలుగు, మంగళగిరిలో మూడు బార్లకు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి.
- పల్నాడు జిల్లాలో 49 బార్లలో 9 బార్లకు మాత్రమే 22 దరఖాస్తు వచ్చాయి. సత్తెనపల్లిలో మూడు బార్లకు 10, దాచేపల్లి, గురజాలలో ఒక్కో బార్‌కు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. చిలకలూరిపేటలోని 10, పిడుగురాళ్లలో 6, మాచర్లలోని 4, వినుకొండలోని 6 బార్లకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 17 బార్లకు నాలుగు బార్లకు మాత్రమే దరఖాస్తులు దాఖలయ్యాయి.

పీఎంవీబీఆర్‌వై ద్వారా యజమానులకు ఆర్థిక ఉపశమనం

- డీఆర్ఎం సుధేష్ణ సేన్



ఈపీఎఫ్‌వో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి విక్సిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకం ద్వారా కొత్త ఉద్యోగులను నియమించుకోవడానికి అవసరమైన ఆర్థిక ప్రయోజనాలను అందించడం ద్వారా నూతన ఉపాధి అవకాశాలను సృష్టించడానికి యజమానులను ప్రోత్సహించడమే లక్ష్యమని గుంటూరు రైల్వే డీఆర్ఎం సుధేష్ణ సేన్ అన్నారు. శుక్రవారం స్థానిక పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో ఈ స్కీమ్‌పై ఈపీఎఫ్‌వో సంస్థ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి పీఎఫ్ ఆఫీసు అసిస్టెంట్ కమిషనర్ పీ గోపాల్ సింగ్ అధ్యక్షత వహించారు. డీఆర్ఎం మాట్లాడుతూ పీఎంవీబీఆర్‌వై కింద కేంద్ర ప్రభుత్వం కొత్త ఉద్యోగులకు, యజమానులకు ప్రయోజనాలను నిర్దిష్ట కాలానికి చెల్లిస్తుందన్నారు. తద్వారా యజమానులపై ఆర్థికభారాన్ని తగ్గిస్తుందన్నారు. అలానే వివిధ రంగాల్లో ఉద్యోగాలకల్పనను ప్రోత్సహిస్తుందనఇ చెప్పారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రముఖుల వినాయకచవితి శుభాకాంక్షలు

రేపల్లె, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు వినాయకచవితి సందర్భంగా విఘ్నాలు తొలగి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆకాంక్షించారు. తొలిపూజలు అందుకునే ఆదిదేవుడు సకల గణాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుడిని అనుగ్రహంతో విఘ్నాలు లేకుండా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. మతసమరస్యాలను చాటేలే భక్తిశ్రద్ధలతో ఘనంగా వినాయకచవితి పండుగ నిర్వహించాలని కోరారు. పర్యావరణానికి హానిచేసే రసాయనక రంగులు ప్లాస్టాఫ్‌క్యారీస్‌తో తయారచేసిన విగ్రమాలకు బదులుగా పర్యావరణాన్ని కాపాడే మట్టిగణపతులను పూజించాలని వారు కోరారు.

పరారీలో షోరూం నిర్వాహకుడు..!

- సుమారు రూ. 20 కోట్లకు పైగా అప్పులు..

మాచర్లటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని ఓ ప్రముఖ షోరూం నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు నిర్వాహకుడు రూ. 20 కోట్లకు పైగా అప్పులు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నిమార్లు ఫోన్ చేసినా నిర్వాహకుడు స్పందించడం లేదని రుణదాతలు లబోదిబోమంటున్నారు. పట్టణంలోని షోరూం గత పది రోజులుగా తెరవకపోవడంతో నిర్వాహకుడు పరారైనట్లు భావిస్తున్నారు. సదరు నిర్వాహకుడు పలుచోట్ల బ్రాంచీలను ఏర్పాటు చేసి ఆయా చోట్ల కూడా భారీగా అప్పులు చేసినట్లు తెలుస్తోంది. అప్పులిచ్చిన వారు జిల్లా ఎస్పీని కలవనున్నట్లు సమాచారం. దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదు.

కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారికి మహిళ ఫిర్యాదు

- ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ కానిస్టేబుల్ సెల్ఫీ వీడియో



ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్

మాచర్ల రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తన పట్ల మాచర్ల రూరల్ పోలీస్‌స్టేషన్లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్ అసభ్యంగా ప్రవర్తించాడంటూ పట్టణానికి చెందిన ఓ మహిళ జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో మనస్తాపం చెందిన కానిస్టేబుల్ షరీఫ్ మహిళ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ మంగళవారం సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ సెల్ఫీ వీడియో కలకలం రేపుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్ తన భార్యకు విడాకులిచ్చి పట్టణంలోని కొత్తపల్లి జంక్షన్లో గల ఓ టౌన్‌షిప్‌లో నివాసముంటున్న ఓ మహిళతో చనువుగా వ్యవహరిస్తున్నారు. సదరు మహిళ తన భర్తతో కలిసి తన వద్ద నుంచి భారీగా నగదు కాజేసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు షరీఫ్ తన సెల్ఫీ వీడియోలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానంటూ తనను బెదిరించడమే కాకుండా పోలీసుశాఖ జిల్లా ఉన్నతాధికారిని కలిసి ఫిర్యాదు కూడా చేసినట్లు చెప్పారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ షరీఫ్ సెల్ఫీ వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ సంఘటనపై రూరల్ ఎస్ఐ సంధ్యారాణిని వివరణ కోరగా.. కానిస్టేబుల్ షరీఫ్ సెల్ఫీ వీడియోపై విచారణ జరుగుతుందని, నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు చెప్పారు.

జూనియర్ ఇంటర్ విద్యార్థి అదృశ్యం



కాకాని తులసీరామ్ (ఫైల్)

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్ పేట ఒకటో లైన్‌లో రైల్వేస్టేషన్ వద్ద పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయునిపాలెం గ్రామా నికి చెందిన కాకాని తులసీరామ్ (17) అదృశ్యమయ్యాడు. తులసీరామ్ గుంటూరులోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ చిల్లీస్ రెస్టారెంట్ దగ్గరలోని హాస్టల్లో ఉంటున్నాడు. ఈ నెల 25న ఉదయం నుంచి కనిపించకుండా పోయినట్లు బాలుడు తండ్రి కాకాని శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రోజా లత తెలిపారు.

రేపల్లె ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి ప్రయాణం పునరుద్ధరణ

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వర్క్సులు కారణంగా చర్లపల్లి వరకే ప్రయాణించి ఆగిపోతున్న రేపల్లె ఎక్స్‌ప్రెస్‌ని తిరిగి సెప్టెంబరు 10వ తేదీ నుంచి పాత కాలమానపట్టిక ప్రకారం ప్రయాణించ నుంది. నంబరు. 17645 సికింద్రాబాద్ - రేపల్లె ఎక్స్‌ప్రెస్ నిత్యం మధ్యాహ్నం 12.40కి బయలుదేరుతుంది. నంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 3.55కి సికింద్రాబాద్ చేరుకొంటుందని సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

58,321 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 60,157 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 58,321 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,337 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	14500
నెంబరు. 5	10000	13500
273	----	----
341	10000	15300
4884	----	----
సూపర్ 10	10000	13800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15200
షార్క్-1	-----	----
బ్యాడిగి 355	10000	14800
దేవనూరు డీలక్స్	10000	14000
ఆర్మూరు	9800	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14000
నెంబరు. 5	10000	13600
273	----	----
341	11000	15400
4884	10000	13000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15300
బ్యాడిగి 355	10000	14000
దేవనూర్ డీలక్స్	10500	13600
ఆర్మూరు	----	---
తాలుకాయలు	5000	7600

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

స్త్రీశక్తి బహిరంగ సభను విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో కీలక పథకమైన స్త్రీశక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేసి, మహిళలకు ఆర్థిక భరోసాను చేకూర్చిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపేందుకు కారంపూడిలో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు.

స్థానిక ఆర్‌అండ్‌బీబంగ్లా ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో సభా ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించి పార్టీ శ్రేణులకు తగు సూచనలు చేశారు. ఈ సభకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, పుల్లయ్య, ఉన్నం లక్ష్మీనారాయణ, గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, మునుగోటి సత్యం, బొల్నేడి శ్రీనివాసరావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి





ఓపీ సేవలు సక్రమంగా అందించాలి

● వైద్య విధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన



ఏరియా వైద్యశాలలో ఓపీని పరిశీలిస్తున్న వైద్య విధాన పరిషత్ పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన


సత్తెనపల్లి, ఆగస్టు 26(ఆంధ్ర జ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాల కు వచ్చే రోగులకు సిబ్బంది ఓపీ సేవలను సక్రమంగా అందించాలని వైద్య విధాన పరిషత్ పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన సూచించారు. మంగళవారం ఏరియా వైద్యశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని ఓపీని ఆమె పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓపీ సేవలను అం దించాలన్నారు. ఓపీ విభాగంలో సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఆర్‌ఎంవో కృష్ణమూర్తిని ఆమె ఆదేశించారు. ఏరియా వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిం చేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తీసుకు వచ్చిందన్నారు. ఆస్పత్రి కి వచ్చే రోగులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేయించుకో వాలన్నారు. ఆమె వెంట డాక్టర్లు సుజాత, అరుణ, నర్సింగ్ సూపరిం టెండెంట్ రాధా ఉన్నారు.

వైద్య విధాన పరిషత్ వైద్యశాలను పరిశీలించిన డాక్టర్ ప్రసూన

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైద్యవిధాన పరిషత్ ఏరియా వైద్యశాలను పల్నాడు జిల్లా వైద్యవిధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన ఆకస్మికంగా సందర్శించి వైద్యశాలలో పారిశుధ్యం, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. వైద్యశాలలో స్టాండర్డ్ మెయింటెనెన్స్ ఉండేలా తీసుకోవాల్సిన చర్యల గురించి సూచించారు. పల్నాడు జిల్లాలో ఉన్న పది వైద్యశాలల్లో స్టాండర్డ్ మెయింటెనెన్స్ ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు ఎక్కువగా జరిగేలా చూడాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన తెలిపారు. పెదకూరపాడులో వైద్యశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పని చేస్తున్న సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు.





లేమల్లెలో మురుగునీటి సమస్యకు పరిష్కారం

అమరావతి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లేమల్లెలో గుంటూరు రోడ్డు ఇరువైపులా కొన్ని సంవత్సరాలుగా ఉన్న మురుగు నీటి సమస్యను మంగళవారం పరిష్కరించారు. సర్పంచ్ ఉగ్గం పున్నమ్మ, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, బి.శ్రీనివాసరావు, నరేంద్ర సమస్యను పరిష్కరించారు.

విద్యారంగానికి పూర్వ వైభవం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి



మాట్లాడుతున్న యాగంటి

మాచర్లటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీతో రాష్ట్రంలో విద్యారంగానికి పూర్వ వైభవం వచ్చిందని టీడీపీ సీనియర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రి హోదాలో 13సార్లు డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలో దాదాపు 1,85,000 మందికి ప్రభుత్వ టీచర్స్ నియామకాలు చేపట్టి విద్యారంగాన్ని బలోపేతం చేసిన వ్యక్తి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. 2024ఎన్నికలకు ముందు కూటమి పార్టీ ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే విజయవంతంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 టీచర్లను నియమించి విద్యారంగానికి పూర్వ వైభవం తెచ్చిన ఘనత విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక 1వ తేదీనే జీతాలు చెల్లించి పూర్వవైభవం తీసుకొచ్చిన యాగంటి అన్నారు. పాల్గొన్నారు.

వినాయకచవితికి చురుగ్గా ఏర్పాట్లు

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలపరిధి గ్రామాల్లో ప్రజలు ప్రత్యేక మండ పాలను ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను తీసుకువచ్చి ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

తుల్జాభవానీ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం

అచ్చంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్లగూడెం అటవీ ప్రాంతంలో ఉన్న గిరిజనుల ఆరాధ్య దైవం తుల్జాభవానీ మునేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన కమిటీ ట్రస్ట్ సభ్యులు భూక్యాఅరుణ, టీబీ నాయక్ ఆధ్వర్యంలో అచ్చంపేట, బెల్లంకొండ మండలాలకు చెందిన సుమారు వెయ్యి మంది గిరిజనులు ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. అచ్చంపేట ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ రమేష్‌నాయక్, పుట్లగూడెం సర్పంచ్ పాపారావు, వెంకటాయపాలెం మాజీ సర్పంచ్ మేళం శ్రీరామమూర్తి, మాదిపాడు టీడీపీ యువనాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

అచ్చంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని తుమ్మేపల్లి శ్రీరాములు జడ్పీ ఉన్నత పాఠశాలలో వజ్రోత్సవాల సందర్భంగా 10వ తరగతిలో మొదటి, ద్వితీయ, తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతులు అందించనున్నారు. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస మూర్తి అందించనున్నట్టు తెలిపారు.



సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

● గురజాల ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వినాయక చవితిని పురస్కరించుకొని డివిజనల్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● దుర్గి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలంలో 55 వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

● ముప్పాళ్ళ ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్ 42 దరఖాస్తులు వచ్చాయనీ పరిశీలించి అన్నింటికీ అనుమతులిస్తామని ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి : డీఎస్పీ

సత్తెనపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి మండపాల నిర్వహకులు ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా చూడాలని సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని వినాయక మండపాల నిర్వహకులకు డీఎస్పీ కార్యాలయ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నాగ మల్లేశ్వరరావు, ఎస్ఐలు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లి మండలంలో గణపతి విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి కోరుతూ పోలీసుశాఖకు 120 దరఖాస్తులు అందాయి.

1000 మట్టి వినాయకుడి ప్రతిమల పంపిణీ

గురజాలటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన మంగళవారం మండలంలోని పులిపాడు గ్రామంలో 1000 మట్టి వినాయకుని ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

రెంటచింతల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టితో తయారుచేసిన ప్రతిమలను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు చేసిన వారమౌతామని టీడీపీ సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి, బీజేపీ యువమోర్చ నేత ఇగుటూరి రాజశేఖరరెడ్డిలు అన్నారు. రెంటచింతలలోని బ్యాంకు సమీపంలో ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు.

● అచ్చంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో వ్యాపారులు రంగులు వేసిన మట్టి వినాయకుడి విగ్రహాలను అమ్మారు.

● సత్తెనపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండు గను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనేందుకు పట్టణ ప్రజలు సిద్ధమయ్యారు. ఇప్పటికే 31 వార్డుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించారు. అచ్చంపేట రోడ్డులో మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమను ఏర్పాటు చేశారు.

మెగా డీఎస్సీలో మూడు పోస్టులు సాధించిన అశ్విని



ఓరుగంటి అశ్విని

రెంటచింతల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలకు చెందిన ఓరుగంటి అశ్విని మెగా డీఎస్సీ 2025 ఫలితాల్లో ఒకేసారి మూడు పోస్టులు సాధించి తన ప్రతిభను సాధించారు. స్కూల్ అసిస్టెంట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో 8వ ర్యాంకు, పీజీటీ విభాగంలో జోన్-3లో 5వ ర్యాంకు, టీజీటీ విభాగంలో జోన్-3లో 4వ ర్యాంకు సాధించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి కాల్ లెటర్లు పంపారు. ఆమె స్కూల్ అసిస్టెంట్ హిందీ పోస్టులో జాయిన్ కాబోతున్నట్లు ఆంధ్రజ్యోతికి చెప్పారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు

గురజాలటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ మార్గదర్శకంతో రీడ్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, కృష్ణ, రమాదేవి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పేదవారికి అండగా కూటమి ప్రభుత్వం

● రూ.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కన్నా నాగరాజు తదితరులు

పిడుగురాళ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతి పేదవాని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో మంగళవారం గురజాల నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 57 మందికి సుమారు రూ.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు నియోజకవర్గంలో సుమారు రూ.12 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశామని, వైసీపీ ఐదేళ్ల కాలంలో రూ.50 వేల విలువైన చెక్కులు అందించడం గగనమన్నారు. మరలా కూటమి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కరు కూడా డబ్బులు లేవని అనారోగ్యంతో బాధపడకూడదనే ఉద్దేశంతో సీఎం రిలీఫ్ ఫండ్‌ను సిఫార్సు చేసిన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో దోచుకోవడం.. దాచుకోవడం తప్ప మరేమి లేదన్నారు. స్త్రీ శక్తి పథకం బహిరంగసభ సెప్టెంబరు 1వ తేదీ సాయంత్రం పిడుగురాళ్లలోని జానపాడు రోడ్డులో నిర్వహిస్తున్నామని, హోంమంత్రి అనితతో పాటు రాయలసీమ ఎంపీ బైరెడ్డి శబరి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవితో పాటు పలువురు మహిళా నేతలు హాజరుకానున్నారని తెలిపారు. సుమారు 10 వేల మందికి పైగా మహిళలతో స్త్రీ శక్తి పథకం మహాసభ విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగ రాజు, డాక్టర్ పున్నం నాగమల్లికార్జునరావు, ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, పాండు రంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కటకం అంకారావు, గండికోట వెంకటేశ్వర్లు, నేలవల్లి బొల్లయ్య, యడ్లపల్లి శివ, చావా రామారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఎండ్రాయిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

చెరువుల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో పెదకూర పాడు నియోజకవర్గంలోని చెరువులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం మండలపరిధిలోని ఎండ్రాయిలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎండ్రాయిలోని 22ఎకరాల విస్తీర్ణంలో గల చెరువును స్థానికులు మరమ్మతులు చేసి చెరువు చుట్టూ 500మొక్కలను నాటేందుకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొని మొక్కలనాటిన అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.హనుమంతరావు, సంగం డైయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో పద్మజ, ఏపిఓ సుభావతి, మునగోడు, నరుకుళ్లపాడు, పెదమద్దూరు పీఏసీఎస్‌ల చైర్మన్‌లు ఎన్.నాగార్జున, బి.జగదీష్, బి.సూర్యనారాయణ, డీసీ చైర్మన్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

రాజుపాలెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలో ఉన్న తహసీ ల్దార్ కార్యాలయాన్ని మంగళవారం రాత్రి కలెక్టర్ అరుణ్‌బాబు తనిఖీ చేశారు. కార్యాలయంలోని అన్ని గదులను ఆయన పరిశీలించారు. కార్యాలయం పగుళ్లు ఉండి పెచ్చులూడి ఉండటం గమనించారు. కార్యాలయ భవనం ప్రమాద భరితంగా ఉండటంతో అందుబాటులో ఉన్న సీడీపీవో భవనంను పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి శాఖపరమైన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీవో రమాకాంత్ రెడ్డి, తహసీల్దార్ సరోజా, సిబ్బంది ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

జనార్దనస్వామి దేవాలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా సుబ్బారావు

కారంపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లి గ్రామంలో ఉన్న భూనీల సమేత జనార్దనస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా ఉమ్మనేని సుబ్బారావు నియమితులయ్యారు. ఈ మేరకు సుబ్బారావుతో మంగళవారం దేవాలయంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌తోపాటు ట్రస్టుబోర్డు సభ్యులుగా చావా శరభయ్య, ఉన్నం సీతమ్మ, బత్తుల పద్మ, నిమ్మల వెంకటశివ, షేక్ ఇమ్మయ్య, బి.రాజ్యలక్ష్మి, బి.కుమారి, ఆలయ ప్రధాన అర్చకుడు జగదీష్ ఆచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పంగులూరి అంజయ్య, వాణిజ్య విభాగంగా జిల్లా కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, సర్పంచ్ ఉన్నం మాధవి మల్లికార్జునరావు, గమిడి పూర్ణయ్య, పంగులూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28 గురువా రం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపా రు. సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలన్నారు.

అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే లైసెన్స్ రద్దు

● మండల ప్రత్యేక అధికారి పీ ఝాన్సీరాణి

నకరికల్లు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల ధరలను ఏ డీలర్లైనా అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌ను రద్దు చేస్తామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ పీ.ఝాన్సీరాణి హెచ్చరికలు జారీ చేశారు. నకరికల్లులోని సాయికృష్ణ ఫెర్టిలైజర్స్, మన గ్రోమోర్ సెంటర్, గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఎరువుల స్టాక్‌లను మంగళవారం పరిశీలించారు. నకరికల్లులోని హరికృష్ణ ఫెర్టిలైజర్స్‌లో 370 ఎరువుల యూరియా బస్తాలు ఉన్నట్టు గుర్తించారు. మిగతా చోట్ల యూరియా లేదన్నారు. స్టాక్ రిజిస్టర్లకు, భౌతికంగా ఉన్న నిల్వలను పరిశీలించారు. ఎరువుల తనిఖీ లపై సమగ్ర నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్టు ఝాన్సీరాణి తెలిపారు. తనిఖీల్లో పిడుగురాళ్ళ ఏడీఏ బీ శ్రీకృష్ణ దేవరాయలు, తహసీల్దార్ కే.పుల్లారావు పాల్గొన్నారు.

● రాజుపాలెం : ఎరువులను అధిక ధరలకు విక్రయించిన, కృత్రిమ కొరత సృష్టించిన కఠిన చర్యలు తీసు కుంటామని మండల ప్రత్యేక అధికారి నారరముని హెచ్చరించారు. మంగళవారం మండలంలోని గణపవరం, ఉప్పలపాడు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.



పిడుగురాళ్లలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ, రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు

● పిడుగురాళ్ల : రైతులు సాగు చేస్తున్న పంటలకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం సరఫరా చేస్తుందని మండల ప్రత్యేక అధికారి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం పిడుగురాళ్లలో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కూడిన బృందం పలు ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసింది. వ్యాపారులు ఎక్కడైనా ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించినట్లైతే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆంజనేయులు హెచ్చరించారు. తహసీల్దార్ మధు బాబు, ఎస్ఐ మోహన్, ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి వేణుగోపాల్, సిబ్బంది ఉన్నారు.

● రెంటచింతల : ఎరువులను అధిక ధరలకు విక్రయించినా కృత్రిమ కొరతను సృష్టించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ప్రత్యేకాధికారుల బృందం హెచ్చరించింది. మంగళవారం రెంటచింతలలోని మార్కెట్ యార్డు గొడౌన్లు, మన గ్రోమోర్ సెంటర్,ఎరువుల దుకాణాలను ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు నేతృత్వంలో అధికారులు తనిఖీ చేశారు.

● కారంపూడి : ఎరువుల డీలర్లు కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు ఎరువులను విక్రయించినా లైసెన్సులు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏవో పోట్ల నరసింహారావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.

● అచ్చంపేట : అచ్చంపేటలో మంగళ వారం మన గ్రోమోర్ సెంటర్‌ను వ్యవసాయ అధికారులతో పాటు తహసీ ల్దార్ కే శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి పీ మస్తాన మ్మ, సీఐ శ్రీనివాసరావుతో కలసి ఎరువుల దుకాణాన్ని పరిశీలించారు.

● క్రోసూరు : ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, అనధికారికంగా నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారుల బృందం తెలియజేసింది. మంగళ వారం క్రోసూరులోని పలు ఎరువుల దుకాణాల్లో అధికారులు విస్తృతం గా తనిఖీలు చేపట్టారు.

● సత్తెనపల్లి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను మండల స్థాయి అధికారుల బృందం మంగళవారం తనిఖీలు చేపట్టారు. గోదాముల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. తనిఖీల్లో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, ఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నా రు.

● ముప్పాళ్ళ : ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని డీలర్లను ఏవో ఎస్ శ్రీధర్‌రెడ్డి హెచ్చ రించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను మండల స్థాయి అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో తహసీల్దార్ నగేష్, ఎస్ఐ సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

● పెదకూరపాడు : ఎరువులు కొనే ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్ క్రమం తప్పకుండా రాయాలని మండల ప్రత్యేక అధికారి షేక్ మహబూబ్ సుభానీ అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరులో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

● మాచవరం : మాచవరం మండలపరిధిలోని అన్ని గ్రామాల ఎరువుల దుకాణదారులు రైతుల అవసరాల మేరకు ఎరువులు అందించాలని ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు దుకాణదారులను ఆదేశించారు. మాచవరంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం తనిఖీ చేశారు. బిల్లులను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఏవో కే.రామమ్మ, వీఏఏ ప్రియాంక పాల్గొన్నారు.

చవితికి సిద్ధమైన గణేష్ మండపాలు

పిడుగురాళ్ల, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): వినాయకచవితి పండుగను పురస్కరించుకొని పట్టణ, రూరల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గణేష్



గీతిక సీబీఎస్ఈ స్కూల్లో వినాయకుడి రూపంలో కూర్చున్న విద్యార్థులు

మండపాలు కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాల అలంకరణ, వివిధ ఆకృతులతో ఉన్న గణేష్ విగ్రహాలను మండపాల వద్దకు ఊరేగింపుగా తరలించుకువచ్చారు. పిడుగురాళ్ల జానపాడురోడ్డు, ఆంధ్రాబ్యాంక్ సెంటర్, సినిమాహాలు సెంటర్, శివాలయం వద్ద, ఆకర్షణీయంగా మండపాలు వెలిశాయి. మాయబజార్, జానపాడు రోడ్డులో చవితి పూజా సామాగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో రద్దీగా ఏర్పడింది.

సీబీఎస్ఈ స్కూల్లో...

పిడుగురాళ్ల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లి సమీపంలో ఉన్న గీతిక సీబీఎస్ ఈ పాఠశాలలో మంగళవారం వినాయకచవితి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు వినాయకుని వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం వినాయకుని రూపంలో విద్యార్థులు కూర్చున్న విధానం అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల చైర్మన్ తాళ్లపల్లి బాలగంగాధరరెడ్డి, వైస్ చైర్మన్ తాళ్లపల్లి పద్మశ్రీ, డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధి పాఠశాలలో ముందస్తు గణేష్ ఉత్సవాలు

పిడుగురాళ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తుమ్మలచెరువు సమీపంలోని బోధి పాఠ శాలలో మట్టి గణపతి వినాయకులనే పూజించాలని కోరుతూ విద్యార్థులందరికీ గణేష్ విగ్రహ తయారీ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కళాత్మకతను ప్రదర్శించారు.

పారదర్శకంగా మెగా డీఎస్సీ

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పారదర్శ కంగా మెగా డీఎస్సీని నిర్వహించిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు యువతకు ఇచ్చిన మాట ప్రకారం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్య ర్థులకు వయస్సు మినహాయింపు ఇచ్చి అండగా నిలబడిందన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత నారా లోకేశ్‌కే దక్కు తుందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పని చేసిన 14 సంవత్సరాల్లోనే డీఎస్సీలు నిర్వహించి 1,80,208 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉపాధ్యాయులను అన్ని విధాలా మోసం చేశాడన్నారు.

మదర్ థెరిస్సా సేవలు వెలకట్టలేనివి

సత్తెనపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): భారతదేశానికి మదర్ థెరిస్సా అందించిన సేవలు వెలకట్ట లేనివని టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదు లు అన్నారు. మంగళవారం పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఆస్పత్రి వద్ద ఉన్న మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ఆమె జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గంగూరి అజయ్ కుమార్, కొల్లా వెంకటేశ్వర రావు, పూదోట రాజు, మద్దినేని వెంకట చలపతిరావు పాల్గొన్నారు. మల్లమాంబ వృద్ధాశ్రమంలో సాయి కృష్ణ మల్టీ స్పెషా లిటీ డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏరియా వైద్యశాలలో జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య విధాన పరిషత్ పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

● మాచర్ల రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదర్‌థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యాన పట్టణంలోని మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు.

● మాచవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మదర్ థెరిస్సా జయంతిని ఘనంగా జరుపు కున్నారు. పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

● పెదకూరపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్లో మంగళవా రం మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

విఘ్నాలు తొలగి సంతోషంగా ఉండాలి

● చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగతో విఘ్నాలు తొలగి ప్రతిఒక్కరు పాడిపంటలు, వ్యాపారాలతో సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతులు, కార్మిక, శ్రామిక, వ్యాపార వర్గాలన్నీ విఘ్నేశ్వరుని దయతో బాగుండాలని కోరారు.

ఎమ్మెల్యే ప్రవీణ్ వినాయక చవితి శుభాకాంక్షలు

పెదకూరపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలకు స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వినాయక చవితి శుభాకాంక్షలను మంగళవారం తెలిపా రు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, భోగ భాగ్యాలతో వినాయకుని దీవెనెలు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.

రామలింగారెడ్డి ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణం

● కలెక్టర్ అరుణ్‌బాబు

ముప్పాళ్ళ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగంటివారి పాలెం గ్రామానికి చెందిన మారూరి రామలింగారెడ్డి ఆత్మహత్య చేసు కోవడానికి కుటుంబ కలహాలు లేదా ఆర్థిక సమస్యలే కారణం కావ చ్చని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఒక్కరి పింఛను కూడా తొలగిం చలేదన్నారు. రామలింగారెడ్డికి అంధత్వ పింఛను 6వేలు వస్తుందని అతడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తుండటంతో పింఛను అర్హత నిరూపించుకోవాలని నోటీసు జారీ చేశారన్నారు. పింఛను నిలిపివేయడం వల్లనే ఆత్మహత్య చేసుకున్నాడనేది పూర్తిగా అవాస్తవం అని కలెక్టర్ మీడియా ద్వారా తెలిపారు.

న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాపట్ల న్యాయవాది డీ.విజయకుమార్‌ను బాపట్ల పోలీసులు దుర్భాషలాడి అక్రమంగా నిర్బంధించటాన్ని ఖండిస్తూ న్యాయవాదులు మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జి.అజయ్ కుమార్, మణిబాబు, జానీ ఖాజావలి, కోటేశ్వరమ్మ, నాగుల, అబ్దుల్ రహీం, జ్ఞాన్‌రాజ్‌పాల్, శేషయ్య, శ్రీనివాసరావు, విజయకుమార్ పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో న్యాయవాదుల నిరసన

సమస్యల పరిష్కారానికి కృషి : ఆర్డీవో

రాజుపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీవో రమాకాంత్ రెడ్డి చెప్పారు. ఈ నెలలో నిర్వహించిన గిరిజన దినోత్సవం రోజున ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అంబేద్కర్ గిరిజన గూడెంను సందర్శించి అక్కడ నివశిస్తున్న ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం మీ వద్దకు వస్తుందన్నారు. దీంతో మంగళవారం మండలంలోని అంచులవారిపాలెం శివారు అంబేద్కర్ గిరిజనగూడెంలో ఆయన తహసీల్దార్ సరోజా, ఎంపీడీవో జివి సత్య నారాయణ, ఏవో వెంకట నరసయ్యలతో కలిసి సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గణపవరంలో ఇద్దరు రైతులు తమ సమస్య పరిష్కారించాలని గ్రీవెన్స్‌లో పెట్టుకున్న అర్జీని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందజేశారు.



అంబేద్కర్ గిరిజనగూడెంలోని ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● ఎంపీడీవో దేవరపల్లి వీరయ్య

దాచేపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ముమ్మరంగా ఉన్న పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని గ్రామాల్లో శానిటేషన్ అధికారులు పరిశుభ్రత పై దృష్టి సారించాలని ఎంపీడీవో దేవరపల్లి వీరయ్య కోరారు. మంగళవారం దాచేపల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యా లయంలోని మీటింగ్ హాల్లో జరిగింది. సమావేశానికి ఎంపీపీ కందుల జాన్ అధ్యక్షత వహించారు. డ్రెయినేజ్ వ్యవస్థను మెరుగుపరచాలని, తాగునీరు ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ క్లోరినేషన్ చేయా లని తెలిపారు. ప్రత్యేకాధికారి ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగు లకు ప్రజా ప్రతినిధులు సహకరించి పరిశుభ్రతలో భాగం కావాలని వివరించారు. సమావేశంలో ఎంఈవో, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచా యతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ, సీడీపీఎస్, ఇతర శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల గురించి సమావేశంలో సభ్యులకు తెలిపారు.

జల జీవన్ మిషన్ పనుల పరిశీలన

పెదకూరపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ పథకం ద్వారా పెదకూరపాడులో జరిగిన పనులను జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరరావునాయక్ పరిశీలించారు. మంగళవారం జల జీవన్ మిషన్ మానిటరింగ్ కమిటీ ప్రతినిధులతో కలసి గృహాలకు వెళ్లి సకాలంలో తాగునీటి సరఫరాపై గృహ యజమానులను అడిగి నీటిని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సోమయాజులు, డీఈ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ శరత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

● కలెక్టర్‌కు జాస్తి వీరాంజనేయులు వినతి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు, రిజిస్ట్రేషన్ సర్‌చార్జి నిధులు విడుదల చేయాలని అఖిల భారత పంచాయతీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నరసరావుపేటలో కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.



మదర్ థెరిసా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, ఎంఏఎం చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు తదితరులు

మదర్ థెరిసాకు ఘన నివాళి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా మానవసేవలకు ప్రతీకగా మదర్ థెరీసా నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేట పట్టణంలో మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పల్నాడు రోడ్డులో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ మదర్ థెరిసా తన జీవితకాలంలో 1979లో నోబెల్‌శాంతి బహుమతి, 2016లో భారత రత్నగౌరవాన్ని అందుకున్నారన్నారు. ఆమె సేవలు ప్రపంచవాప్తంగా 123కి పైగా దేశాలలో విస్తరించాయన్నారు. కార్యక్రమంలో ఎంఏఎం విద్యాసంస్థల అదినేత ఎంఆర్ శేషగిరిరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● స్థానిక మదర్ థెరీసీ హాస్పిటల్‌లో మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మదర్ థెరిసా హాస్పటల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశ్‌రావు, ఎంఆర్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

● నోబెల్ శాంతి అవార్డు గ్రహీత, భారతరత్న మదర్ థెరిసా జయంతి మంగళవారం పట్టణంలో జనసేన పార్టీ, చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.ఆనందబాబు, కె.గోవిందు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గుప్తా శ్రీకాంత్, ఎ.శ్రీను, ఎస్.నాగరాజు, కె.సిద్ధయ్య, డి.విజయ్‌కుమార్, ఎస్‌డీ గౌస్, ఎం.వేమలయ్య, చింతా మధవరావు, మనమాల కొండ, భీమా సాంబయ్య, లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరుపై ఆర్డీవో అసంతృప్తి

శావల్యాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పగించిన కార్యక్రమాలను సకాలంలో పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని ఆర్డీవో మధులత స్థానిక రెవెన్యూ సిబ్బందిపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. శావల్యాపురం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలతో మంగళవారం ప్రత్యేకంగా సమీక్షించారు. కేంద్రప్రభుత్వం అప్పగించిన ఆయుష్మాన్ భారత్ ఆధార్ సీడింగ్‌లో జాప్యం జరగడంతో రెవెన్యూ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మండలవ్యాప్తంగా 1320 కుల ధ్రువీకరణపత్రాలు నమోదు చేయాల్సి ఉండగా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. తహసీల్దార్ అర్జున్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శావల్యాపురంలో రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో మధులత

వంద శాతం అక్షరాస్యత సాధించాలి

● ఎంపీడీవో సీతారామయ్య

బొల్లాపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల వెలుగు కార్యాలయంలో 'అక్షరాంధ్ర ఉల్లాసం- 2' ఒక రోజు కార్యక్రమంలో వీవోఏలు, వెలుగు ఏపీఎం రామాంజనేయులు ఆధ్వర్యంలో వయోజన విద్య పర్యవేక్షకుడు కే వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో పీ సీతారామయ్య మాట్లాడుతూ గ్రామా ల్లో అందరికీ చదవటం, రాయటం, అంకెల పరిజ్ఞానాన్ని నేర్పించి మెరుగైన జీవితం పొందటానికి కృషి చేసి అక్షరసత్యం సాధనకు, బ్యాంక్ లావాదేవీలకు, సంఖ్యలు, కూడికలకు తీసి వేత లు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కే వెంకటేశ్వర్లు, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



అక్షర ఉల్లాసంపై మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ప్లాస్టిక్ వాడకంపై మున్సిపల్ అధికారుల ప్రత్యేక డ్రైవ్

చిలకలూరిపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు బజార్‌లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని నివారించడానికి మున్సిపల్ అధికారులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వ హించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణరావు, రైతుబజార్ ఈవో షేక్ కాజాతో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది డ్రైవ్‌లో పాల్గొన్నారు. అనంతరం పట్ట ణంలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగు లను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ కవర్ల ను ఉపయోగిస్తున్న వ్యాపారులకు జరి మానా విధించారు.

గొట్టిపాడులో జూదరుల అరెస్టు

చిలకలూరిపేట, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): చిలకలూరిపేట మండలం గొట్టి పాడు గ్రామ పొలాల్లో కోత ముక్క ఆడు తున్న ఆరుగురిని చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐ జి.అనిల్‌కుమార్ తన సిబ్బంది సాయంతో వారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,420లు స్వాధీనపర చుకు న్నారు. కేసు నమోదు చేశారు.

వృద్ధులకు అన్నదానం

చిలకలూరిపేట, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): యంగ్ మ్యాన్ క్రిస్టియన్ అసోసియే షన్ (వైఎంసీఏ) ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణం లోని చీరాల రోడ్డులో ఉన్న బాహూజీ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఆర్సీఎం చర్చి ఫాదర్ థామస్, చుక్కా విన్సెంట్ పాల్ పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు ఉచిత విద్యుత్: ఈఈ ఏడుకొండలు

చిలకలూరిపేట, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గపరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పా టు చేసిన చవితి పంది ళ్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసే ఏర్పాట్లు చేశామని విద్యుత్ శాఖ ఈఈ వై.ఏడుకొండలు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ విషయం లో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. పట్టణంలో నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసున్నా మని, వాటి వల్ల ఎటువంటి నష్టం కలుగ దని అన్నారు. కేంద్ర సబ్సిడీపై అమలవు తున్న సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగిం చుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో డీఈఈ అశోక్ కుమార్, ఏఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కీళ్ల వ్యాధులకు ఉచిత కన్సల్టేషన్: డాక్టర్ మన్నే దివ్య

నరసరావుపేట లీగల్, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని దివ్య రుమటాలజీ వైద్య శాలలో మొదటి వార్షికోత్సవం సంద ర్భంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో కీళ్ల వ్యాధులకు సంబంధించి ఉచిత కన్సల్టేషన్ నిర్వహించనున్నట్లు వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ మన్నే దివ్య మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈ అవకాశాన్ని పల్నాడు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసు కోవలసినదిగా ఆమె కోరారు.

వివాహిత అదృశ్యం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని బాలయ్య నగర్‌కు చెందిన ఓ వివాహిత ఈనెల 25వ తేదీ నుంచి తన కుమారుడితో సహా కనిపించడం లేదని ఆమె భర్త షేక్ బాషా మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పోలీసులు తెలిపారు.

ముప్పాళ్ళ విద్యార్థికి ప్రథమ ర్యాంకు


సాంబశివరావు

ఈపూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థి చందాల సాంబశి వరావు స్కూల్ అసి స్టెంట్ ఫిజికల్ ఎడ్యుకే షనల్ విభాగంలో గుంటూరు జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. జోన్-3 (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) స్థాయిలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టు లోనే ప్రథమ ర్యాంకు సాధించినట్లు కళా శాల ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటరావు మంగ ళవారం తెలిపారు. ఈ నెల 29వతేదీన క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయన్నారు. విజేత లకు బహుమతులు అందజేస్తామన్నారు.

పీఎన్‌సీ అండ్ కేఆర్‌లో ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశా లలో ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సైబర్ సెక్యూరిటీ నిపుణులు గాయం భరత్‌కుమార్‌రెడ్డి ఎథి కల్ హ్యాకింగ్ ప్రాముఖ్యం, వివిధ రకాల సైబర్ దాడులు గురించి వివరించారు. డెమోస్ ద్వారా హ్యాకింగ్ పద్ధతులను, వాటి నివారణ చర్యలను విద్యార్థులకు ప్రయోగా త్మకంగా చూపించారు. ఎథికల్ హ్యాకింగ్‌లో ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాదు, ప్రిన్సిపాల్ జీ వెంకటేశ్వరరావు, అకడమిక్ ఇన్‌చార్జి హరికృ ష్ణ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను 457మంది విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు తెలి పారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ షేక్ మీరావలి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయనాలతో చేసిన విగ్రహాలతో వాతావ రణ, పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుంద న్నారు. మట్టి గణపతుల విగ్రహాల పంపి ణీలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాం డెంట్ షేక్ కరీం మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీ సర్ హెచ్.గంగాధర్ పాల్గొన్నారు.

పేటలో... వెరైటీ వినాయకులు

● అమెరికన్ డైమండ్స్‌తో గణనాథుని విగ్రహం ● సందర్శకులకు బహుమతులు






చిలకలూరిపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో గోల్డెన్ యూత్ షరాఫ్ బజార్ వారి ఆధ్వర్యంలో 50 లక్షల అమెరికన్ డైమండ్స్ తో సుమారు రూ.10 లక్షల వ్యయంతో సర్వాంగ సుంద రంగా గణనాథుని విగ్రహాన్ని వినాయక చవితి ఉత్సవా లకు సిద్ధం చేశారు. సుమారు 11 అడుగుల ఎత్తున హైదరాబాద్, కల కత్తా, తంజావూరు శిల్పులతో తయారు చేసిన విగ్రహాన్ని 15 రోజుల పాటు 9 మంది నైపుణ్యం గల కళాకారులు తీర్చిదిద్దారు. 30వ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి పందిరిని సందర్శించే భక్తులకు బహుమతులు కూడా ఇస్తామని నిర్వాహకులు ప్రకటించారు. ప్రథమ బహుమతిగా మారుతి ఆల్టో కారు, ద్వితీయ బహుమతిగా ఎలక్ట్రికల్ బైకు, తృతీయ బహుమతిగా సాంసంగ్ ఫ్రిడ్జ్ అందచేస్తామని తెలి పారు. షరాఫ్ మర్చంట్స్, స్వర్ణకార సంఘం, మెయిన్ బజార్ వర్తక సంఘం వారి సహాయ సహకారాలతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కన్వీనర్ పొట్టి వెంకట శివరత్నబాబు తెలిపారు.

పర్యావరణానికి హాని కలిగించకుండా...

చిలకలూరిపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీవీ ఐఐటీ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పర్యావరణానికి హాని కలగని పదార్థాలతో వినాయక విగ్రహాలు తయారుచేసే పోటీ నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు పూల మొగ్గలతో, మట్టితో, గోధుమపిండితో, బియ్యపు పిండితో, కాయగూ రలతో, పసుపుతో, దారాలతో, రవ్వతో, కాగితపు కప్పు లతో, కాగితాలతో, రావిఆకుతో, తమలపాకులతో, బియ్యంతో, మట్టి, సహజ రంగులతో, వివిధ రకాల పప్పుదినుసులతో, ఇలా రకరకాల వస్తువులతో గణనా థుని ప్రతిమలను పోటాపోటీగా తయారు చేసి వారి లోని సృజనాత్మకతకు పదునుపెట్టారు.


చిలకలూరిపేటలో నిర్వహించిన పోటీలో విద్యార్థులు తయారు చేసిన గణనాథుని ప్రతిమలు

మట్టి విగ్రహాలను పూజించండి

● ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళ వారం పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులోని శ్రీనివాసన గర్ వద్ద విజయ్ గణపతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్లంశెట్టి మోహనరావు సహకారంతో మట్టి వినాయ కుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు హాజరై మట్టి గ ణపతుల విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్లంశెట్టి మోహనరావు, వాసిరెడ్డి రవి, షేక్ మహ మ్మద్ రఫీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: వినాయకచవితిని పురస్కరించు కొని పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా మట్టిగణపతి విగ్రహాలనే పూజించాలని కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్ పిలుపునిచ్చారు. శావల్యాపురం లోని శ్రీరామపబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులంతా కలసి మంగళవారం మట్టితో వివిధ రకాల ఆకృతుల్లో వినా యకుని విగ్రహాలను తయారు చేశారు. కరస్పాండెంట్ మోహన్‌చంద్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన గణపతివిగ్రహాలతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని, పెద్దపెద్ద విగ్రహాలకు పూజ చేయడం ముఖ్యం కాదని, విగ్రహం చిన్నదైన భక్తిశ్రద్ధ లతో పూజించాలన్నారు. విద్యావంతులు మట్టిగణపతి విగ్రహాల ఉపయోగాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టర్ అజిత్‌చంద్, టీచర్‌లు పాల్గొన్నారు.

గణపతి మానవహారం

వినుకొండ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గీతాంజలి స్కూల్స్ విద్యార్థులు వినాయక చవితి వేడు కలు పురస్కరించుకొని గణపతి రూపంలో చేసిన మానవహారం విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తేళ్ళ కృష్ణ వేణి మాట్లాడుతూ చిన్నారులకు ఎంతో ఇష్టమైన పండుగలలో వినాయక చవితి ఒకటి అని ఈ పండు గని ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషంగా జరుపుకుంటారు


గణపతి మానవహారంగా ఏర్పడిన గీతాంజలి విద్యార్థులు

అని అందుకే చిన్నారుల ఆనందం కోసం ఈ గణపతి మానవహారం ఏర్పాటు చేయడం జరిగింది అని తెలి పారు. అలాగుననే ప్రతి ఒక్కరూ ఈ వినాయక చవితి సందర్భంగా కెమికల్స్ తో తయారు చేసిన విగ్రహాలు మరియు ప్రతిమలు కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలు మరియు ప్రతిమలనే వాడి పర్యావరణ పరిరక్షణ కొరకు సాయపడవలసినదిగా కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యా యులు మరియు తల్లిదండ్రులు పాల్గొ న్నారు.


వేడుకల్లో గీతమ్స్ బ్లూమ్స్ విద్యార్థులు

● నూజెండ్ల: మండలంలోని వినా యక చవితి వేడుకలకు గ్రామాల్లోని యువత ఉత్సాహంగా మంగళవారం ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా ప్రధాన కూడళ్ళల్లో మండపాలు నిర్మించి ఆకర్షణీయమైన విగ్ర హాలను ఏర్పాటు చేశారు. మండలంలోని పెద్దవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు ఘంటా నాగేశ్వరరావు ఆధ్వర్యం లో వినాయకచవితి ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ విద్యార్థులకు కథా రూపంలో తెలియజేశారు.


కదిలి ఫల గణేష్ చిత్రం


మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

మట్టి గణనాథుని విగ్రహాల పంపిణీ

చిలకలూరిపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని పాటిమీద ఉన్న శ్రీ అంకమ్మ తల్లి పోతురాజు గార్ల దేవస్థానంలో వినాయక చవితిని పురస్కరించు కుని 500 మట్టి వినాయక ప్రతిమలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా లీగల్ సెల్ చైర్మన్ పమిడి రాజ్ కుమార్, టార్గెట్ బాయ్స్ సంస్థల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువ జన అధ్యక్షుడు మాదాసు పృథ్వీరాజ్ సాయి, నక్కా నర సింహ పాల్గొన్నారు.

● స్థానిక పండరీపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చౌత్రా సెంటర్ శివాలయం వద్ద అర్బన్ సీఐ పి.రమేష్ 500 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

● బ్రిలియంట్ స్కూలు ఆవర ణలో వాసవీ క్లబ్(768) ఆధ్వ ర్యంలో విద్యార్థులకు మహా గణ పతి చిత్రలేఖన పోటీలు, 200 పైగా గణపతి మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

● శ్రీవినాయక ట్రస్ట్ ఆధ్వ ర్యంలో సంస్థ ఛైర్మన్ చంద్రపట్ల మణికుమార్ రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలోని వినాయకుడి గుడి వద్ద 500 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

ఎరువులు బ్లాక్ మార్కెట్‌లో అమ్మకుండా పర్యవేక్షించాలి

మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి


ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి

శావల్యాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఎరువు లను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలను అమ్మకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి తెలిపారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యా లయంలో మండలస్థాయి అధికారులు, ఫర్టిలైజర్ షాపుల యజమానులతో మంగళవారం ప్రత్యేక సమా వేశాన్ని నిర్వహించారు. ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎరువులు కృత్రిమ కొరత తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, రైతులు మొత్తం ఎరువులు ఒకేసారి కొనుగోలు చేసి నిల్వ పెట్టకుండా దశలవారీగా కొనుగోలు చేసేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఫర్టిలైజర్ షాపుల యజమానులు అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా రైతులకు ఎరువులను అమ్మాలని, రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు బిల్లులు ఇవ్వాలని, రైతుల నుంచి ఫిర్యా దులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనం తరం శావల్యాపురంలో మన గ్రోమోర్, ఫర్టిలైజర్ షా పులను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీచేశారు. ఎరు వుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లు, షాపు లైసెన్స్‌లు, ఓఫాంలు పరిశీలించారు. తహసీల్దార్ అర్జున్‌నాయక్, ఎంపీడీవో సీతారామయ్య, ఇన్‌చార్జి ఎంఏవో రామా రావు, ఎస్‌ఐ లోకేశ్వరరావు, ఎంఈవో సాంబశివరావులు పాల్గొన్నారు.

● వినుకొండ: పట్టణ పరిధిలోని ఎరువుల షాపు లను తహసీల్దార్ సురేష్, మండల వ్యవసాయ అధి కారి జి.వరలక్ష్మి తనిఖీ చేశారు. తనిఖీల్లో గోడౌన్ లో నిల్వలు, స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు నిర్వహణ పరిశీలిం చారు.


ఎరువుల షాపుల్లో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్, ఏవో

ఎరువుల రాక్ పాయింట్ పరిశీలన

నాదెండ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాతులూరు, కనపర్రు గ్రామాల పరిధిలో గల రైల్వే ఎరువుల రాక్ పాయింట్, మైక్రో న్యూట్రియంట్ పురుగు మందుల తయారీ కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధి కారి ఎం జగ్గారావు మంగళవారం తనిఖీ చేశారు. సాతులూరు రైల్వే స్టేషన్‌లోని రాక్ పాయింట్‌ను సంద ర్శించిన ఆయన ఎరువుల విషయమై సంబంధిత ఏజీ న్సీలతో మాట్లాడారు. జిల్లాకు సంబంధించిన కేటాయిం పులపై ఆరా తీశారు. ఆయనతో పాటు ఏడీఏ హను మంతరావు, ఏవో శ్రీలత తదితరులు ఉన్నారు.


రైల్వేస్టేషన్‌లో ఎరువులను పరిశీలిస్తున్న డీఏవో జగ్గారావు

● మండలంలోని చిరుమామిళ్ళలో ఉన్న ప్రైవేట్ ఎరువుల దుకాణ దారుల గోదాములను నాదెండ్ల ప్రత్యేక అధికారి సంజీవరావు, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో స్వరూపరాణి వ్యవసాయ అధికారి శ్రీలత, ఎస్‌ఐ పుల్లారావులు బుధవారం తనిఖీ చేశారు.

● నూజెండ్ల : మండలంలోని ఐనవోలు, కొత్తనాగిరె డ్డిపల్లి, పాతనాగిరెడ్డిపల్లి, లింగముక్కపల్లి, గుర్రపునా యుడుపాలెం సొసైటీల్లో మంగళవారం తహసీల్దార్ జీ రమేష్‌కుమార్, ఎస్‌ఐ బీవీ కృష్ణారావు, ఏవో ఆంజనే యులు నాయక్‌లు తనిఖీలు నిర్వహించారు. కృత్రిమ కొరత లేకుండా రైతులకు ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా డీలర్లు శ్రద్ధ చూపాలని తహసీల్దార్ ఆదేశించారు.

● ఈపూరు: మండల ప్రత్యేకాధికారి వెంక ట్రావు ఆధ్వర్యంలో మండలంలోని ముప్పాళ్ళ ఈపూరు ఎరువుల దుకాణాల్లో మంగళవారం తని ఖీలు నిర్వహించారు. ఎరువులు కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

● ఎంపీడీవో ఉమాదేవి

నూజెండ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీవో వీ ఉమాదేవి అన్నారు. నూజెండ్లలో మంగళవారం హౌసింగ్ కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నివాస గృహాల మధ్య పిచ్చి చెట్లను తొలగించి నీడ, పండ్ల మొక్కలను నాటాల న్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ యలమంద, ఏపీవో ఆంజనేయరాజు, ఉపాధి హామీ టీఏలు వెంకటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, సతీష్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ముక్కంటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ గురవారావు పాల్గొన్నారు.


నూజెండ్లలో గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు


వినుకొండలో రోడ్డుపై నడిచేందుకు కూడా వీలులేకుండా నిలిపిన వాహనాలు

ట్రాఫిక్ దిగ్బంధంలో వినుకొండ

● వాహన పార్కింగ్ సెల్లార్లతో దుకాణాలు
● రోడ్లపై వాహనాల పార్కింగ్ ● రోడ్డుకిరువైపులా ఆక్రమణలు

వినుకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ జనాభాకు తోడు వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. పట్టణంలోని ప్రధాన కూడలి శివయ్య స్తూపం, ఏనుగుపాలెం రోడ్డు, ముళ్ళమూరు బస్టాండ్, నరసరావు పేట రోడ్లతోపాటు పట్టణంలోని రద్దీగా ఉండే లాయర్ స్ట్రీట్, సురేష్ మహల్ రోడ్డు, బ్యాంకు బజార్, మెయిన్ రోడ్డు ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలో ఎటు చూసినా డ్రైనేజీ కాలువలపై భవన యజ మానులు అక్రమ నిర్మాణాలు, రోడ్డుకి ఇరువైపులా తోపుడు బండ్లు, రోడ్లపై బస్సులు, కార్లు ఆటోలు నిలిపివేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలు గుతుంది. సురేష్ మహల్ రోడ్డు, లాయర్ స్ట్రీట్, బ్యాంకు బజార్, మెయిన్ బజార్లను పరిశీలిస్తే బ్యాంకులు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు తదితర వ్యాపార సముదాయాలు అధికంగా ఉండటంతో నిత్యం వేలాది వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. ఆయా ప్రాంతాల్లో భవన యజమానులు సీసీ రోడ్లకు ఆనుకొని అక్రమంగా నిర్మాణాలు చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహ నాలు నిలిపే పార్కింగ్ స్థలం లేక వాహనదారులు రోడ్లపై పార్కింగ్ చేయా ల్సిన దుస్థితి ఏర్పడింది. మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో రోడ్డంతా వాహన పార్కింగ్‌తో నిండిపోయి ఉంటుంది. ప్రజలు రాకపోకలు సాగించా లంటే నిత్యం ఇబ్బందులు పడాల్సిందే. వ్యాపార సముదాయాలు కలిగిన ఈ ప్రాంతాల్లో భవనాలకు అండర్ గ్రౌండ్ వాహన పార్కింగ్ సెల్లార్స్ ఉన్నాయి కానీ వాటిని పార్కింగ్‌కు ఉపయోగించకుండా షాపులకు అద్దెలకు ఇవ్వడంతో వాహనాలు రోడ్లపై నిలిచిపోతున్నాయి. రోడ్డుకి ఇరువైపులా ఉన్న డ్రెయినేజీ కాల్వను భవనాల యజమానులు ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేయ టమే కాకుండా సీసీ రోడ్డు వరకు ఆక్రమణలకు పాల్పడ్డారు. జాతీయ రహ దారికి ఇరువైపులా ఉన్న భవనాల యజమానులు కాల్వలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేసి చిరువ్యాపార బడ్డీ కొట్లు, తోపుడు బండ్లు పెట్టించి లక్షల రూపాయల అడ్వాన్సులతో వేలాది రూపాయల అద్దెలు తీసుకుంటూ ట్రాఫిక్‌కు సమస్యకు మూలకారణమవుతున్నారు. డ్రైనేజీపై ఆక్రమణలు తొల గించాల్సిన మున్సిపల్ అధికారులు తరచూ ఆక్రమణల తొలగింపు పేరుతో మార్కింగ్‌లు వేయటం భవన యజమానులను బెదిరించి అక్రమంగా లక్ష లాది రూపాయలు దండుకుంటున్నారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియ మునిసిపల్ అధికారులకు అతిపెద్ద అక్రమ ఆదాయ వనరుగా మారింది. ఉన్నతాధికారులు ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


లింగంగుంట్ల శంకరభారతీపురం హైస్కూలులో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, డీఈవో

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఉపాధ్యా యులకు సూచించారు. కలెక్టర్ తాను దత్తత తీసుకున్న శంకరభారతీపురం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను మంగళవారం ఉదయం సందర్శించారు. ఈ సంద ర్భంగా ప్రతి విద్యార్థితో వ్యక్తిగతంగా మాట్లాడారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసేందుకు కలెక్టర్ సబ్జెక్టుల వారీగా వివిధ ప్రశ్నలు అడి గారు. తనిఖీలో బాగంగా విద్యార్థుల అభ్యాస ప్రమాణాలను, పురోగతిని పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల న్నారు. సిలబస్ పూర్తి చేయడం మీద కంటే విద్యార్థులకు పాఠాలు అర్థమ య్యేలా బోధించడం, ప్రతి విద్యార్థి ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేలా చేయడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. వారంలో రెండు సార్లు డీఈవో పాఠశాలను సందర్శించి బోధనా పద్ధతులను సమీక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పాత బ్యారన్ నగర్ ఆక్రమణదారులతో సమావేశం


పాత బ్యారన్ నగర్ ఆక్రమణదారులతో మాట్లాడుతున్న చైర్మన్లు

చిలకలూరిపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఆర్‌కాలనీ మెయిన్ రోడ్డుకు ఇరువై పులా ఉన్న పాత బ్యారన్ నగర్‌లో ఉన్న 40కి పైగా దుకాణదారులతో మున్సి పల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరీముల్లా మంగళ వారం సమావేశమ య్యారు. ఆ రోడ్డులోని ఆక్రమణలు తొలగిస్తే రోడ్డును వెడల్పు చేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చేయాలని తలపెట్టామని వారు అన్నారు. ఈ సందర్భంగా దుకాణదారులు చేసిన అభ్యర్థనలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకెళతామని వారు చెప్పారు. ఈ రోడ్డులో కాల్వలు దాటి దాదాపుగా రోడ్డుకు ఆనుకుని ఆక్రమణలు ఉండటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది.

అనాథ శవానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆదర్శ ఫౌండేషన్ సభ్యులు

వినుకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీనాయన సత్రం వద్ద ఆగస్టు 24వ తేదీన మర ణించిన అనాథ మహిళకు ఆదర్శ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పువ్వాడ కృష్ణ, ఆదర్శ ఫౌండేషన్ సభ్యులు పీవీ సురేష్ బాబు, గుంటకల అంజి, నరగాయపాలెం అంజి, గుంటకల నాగరాజు పాల్గొన్నారు.


దుస్తులు అందజేస్తున్న హాస్పటల్ యాజమాన్యం

క్రీడాకారిణులకు సమదుస్తుల బహూకరణ

వినుకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రోడ్డులోని నిర్మల (ఐసీఎస్‌ఈ) స్కూల్ క్యాంపస్‌లో జరుగుతున్న మహిళల సబ్ జూనియర్స్ సీనియర్స్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారిణులకు గుంటూరులోని కిమ్స్ శిఖరా హాస్పిటల్, కిమ్స్ చక్ర హాస్పిటల్ డైరెక్టర్లు వైద్యులు కె.జయకిషన్, టి.మహతిలు సమదుస్తులు అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ రాణి, సుపీరియర్ సిస్టర్ సిసిలీ తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కోశాధికారి కొల్లి లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు ఈ శంకర్రావు, కార్యవర్గ సభ్యులు బి.చంద్రశేఖర్, జగదీష్‌రావు, జాయింట్ సెక్రెటరీ జోనానాయక్, ఏడీ ఆంజనేయులు, పీడీ రాధాకృష్ణమూర్తి, శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.